1st Year Happy Work Anniversary.


RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు　　తెలుగు దినపత్రిక


Good for Health
Best for Readers
THE POWER OF RRK PEN

సంపుటి : 2　సంచిక : 127　ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్　శుక్రవారం 21 మార్చి 2025　పేజీలు 8 : వెల 5/-　ఒంగోలు

VOLUME : 02 ISSUE : 127 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Friday 21 Marchi 2025 PAGES : 8 PRICE : 5/-



# టీడీపీ మాస్టర్ ప్లాన్





ఇక వైసీపీ పని అయిపోయినట్లే..

రెండు తెలుగు రాష్ట్రాల్లో టీడీపీ కార్యకర్తలు లేని గ్రామం లేదు.. అలాంటి టీడీపీకి కార్యకర్తలే బలం

పార్టీ ఆవిర్భవించిన నాటి నుంచి ఇప్పటి వరకు ప్రతీ కష్టంలోనూ కార్యకర్తలు తోడుగా నిలుస్తూ వస్తున్నారు

కార్యకర్తే అధినేత అన్న మాటను ఆచరణలో పెట్టడానికి కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

పార్టీలో కొత్తగా క్లస్టర్, యూనిట్, బూత్ విధానాన్ని తీసుకువచ్చారు.

తెలుగు వారి ఆత్మగౌరవం కోసం ఏర్పడ్డ పార్టీ తెలుగు దేశం అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రెండు తెలుగు రాష్ట్రాల్లో టీడీపీ కార్యకర్తలు లేని గ్రామం లేదని అనటంలో అతిశయోక్తి లేదు. అలాంటి టీడీపీకి కార్యకర్తలే బలం. పార్టీ ఆవిర్భవించిన నాటి నుంచి ఇప్పటి వరకు ప్రతీ కష్టంలోనూ కార్యకర్తలు తోడుగా నిలుస్తూ వస్తున్నారు. అలాంటి కార్యకర్తలకు అండగా నిలవాలని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సంకల్పించిన సంగతి తెలిసిందే. కార్యకర్తే అధినేత అన్న మాటను ఆచరణలో పెట్టడానికి కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. వారి బాగోగులు అడిగి తెలుసుకుని, సమస్యలు ఉంటే పరిష్కరించే దిశగా ముందుకు వెళుతున్నారు. తెలుగు దేశం పార్టీ కోటి సభ్యత్వాలతో అతి పెద్ద కుటుంబంగా మారిన సందర్భంలో కార్యకర్తే అధినేతని మంత్రి నారా లోకేష్ అన్నారు. తర్వాతి కాలంలో అన్న మాటను నిలబెట్టుకుంటూ వారికి అండగా నిలవడానికి గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఏ నియోజకవర్గ పర్యటనకు వెళ్లినా కార్యకర్తలతో భేటీ అవుతున్నారు. బాబు ష్యూరిటీ– భవిష్యత్‌కు గ్యారెంటీ, పార్టీ సభ్యత్వం, ఓటర్ వెరిఫికేషన్, మన టీడీపీ యాప్‌లో ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలు, నాయకులతో సమావేశమవుతున్నారు. వారితో ఎక్కువ సమయం గడుపుతున్నారు. పార్టీలో కొత్తగా క్లస్టర్, యూనిట్, బూత్ విధానాన్ని తీసుకువచ్చారు. సీనియర్లను, జూనియర్లను సమానంగా గౌరవిస్తానని, పని చేసే వారిని ప్రోత్సహిస్తానని లోకేష్ వ్యాఖ్యానించారు. కార్యకర్తల సమస్యలు తెలుసుకుని అండగా నిలబడాలని నాయకులను ఆదేశించారు. గతంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు లక్షల మంది పార్టీ కార్యకర్తలను వాలంటీర్లుగా మార్చి.. వారి జీవితాలను నిర్వీర్యం చేసింది. ప్రజల కంటే.. పార్టీ అభివృద్ధిపై ఎక్కువ దృష్టి - మిగతా3లో

## ఎస్సీ వర్గీకరణ ఈ స్థాయికి వచ్చిందంటే..
# వారే కారణం



- ఎస్సీ వర్గీకరణతో అందరికీ మేలు జరుగుతుందని
- మాదగ కులానికి వన్నె తెచ్చిన మందకృష్ణకు అభినందనలు
- ఎస్సీ వర్గీకరణపై చాలా చర్చలు జరిగాయి
- గుర్తింపు లేని కులాలపైనే విస్తృతంగా చర్చలు జరిగాయి

**అమరావతి**

ఎస్సీ వర్గీకరణ ఈ స్థాయికి వచ్చిందంటే.. మంద కృష్ణ, సీఎం చంద్రబాబు నాయుడే కారణమని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. గురువారం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ చేసిన చంద్రబాబుకు పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణతో అందరికీ మేలు జరుగుతుందని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు. మాదగ కులానికి వన్నె తెచ్చిన మందకృష్ణకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై చాలా చర్చలు జరిగాయని ఆయన పేర్కొన్నారు. గుర్తింపు లేని కులాలపైనే విస్తృతంగా చర్చలు జరిగాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వివరించారు. ఎస్సీ వర్గీకరణపై సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రలో రెల్లి - మిగతా3లో



# మావోలకు గట్టి ఎదురుదెబ్బ

- ఎన్‌కౌంటర్‌లో 22 మంది మావోయిస్టులు మృతి
- మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య నిరంతర కాల్పులు
- ఆయుధాలు, మందుగుండు సామగ్రితో పాటు పద్దెనిమిది మంది నక్సలైట్ల మృతదేహాల స్వాధీనం

## దొంగల్లా సభకు వచ్చి సంతకాలు పెట్టి
# వెళుతున్నారు

- ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నలు వేయడం వల్ల మరో ఇద్దరు మెంబర్లు అడగడానికి ఇబ్బంది వస్తోంది
- ఇది సమంజసం కాదని.. ప్రశ్నలు అడగడానికి వారు సభలో ఉండడం లేదు
- ప్రజా ప్రతినిధులుగా ప్రజలు మిమ్మల్ని ఎన్నుకున్నారు



**అమరావతి:**

ఏపీ అసెంబ్లీలో సభ్యుల హాజరుపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు కీలక ప్రకటన చేశారు. ఈ సమావేశంలో 25 ప్రశ్నలకు సమాధానాలు రాలేదని అన్నారు. ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నలు వేయడం వల్ల మరో ఇద్దరు మెంబర్లు అడగడానికి ఇబ్బంది వస్తోందన్నారు. ఇది సమంజసం కాదని.. ప్రశ్నలు అడగడానికి వారు సభలో ఉండడం లేదని.. ఇది చాలా దురదృష్టకరమని అన్నారు. సభ్యులు సభకు రావాలని, ప్రజా ప్రతినిధులుగా ఎన్నికయిన సభ్యులు సగౌరవంగా సభకు రావాలని సూచించారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ సభ్యుల తీరుపై స్పీకర్ - మిగతా3లో





## ఎయిర్ లైన్స్‌లో
# ఇండిగో హవా

- 5 లక్షల చేరువలో ఎయిర్ ట్రాఫిక్
- మధ్య తరగతి ప్రజలను ఆకర్షించేందుకు ఎయిర్ లైన్స్ కంపెనీలు ప్రయత్నిస్తూనే ఉంటాయి.
- చాలా కంపెనీలు పలు రకాల వ్యూహాలను రచిస్తూనే ఉన్నాయి
- సంపన్న దేశాల మాదిరి భారత్ లో ఎయిర్ లైన్స్ సేవలను విస్తరించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు

# తెలుగుదేశం పార్టీలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

- జగన్ అలా చేయడం తీవ్రంగా బాధించింది
- త్వరలో తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు ఆయన ప్రకటించారు.
- 2019లో తనకు మంత్రి పదవి ఇస్తానని హామీ ఇచ్చారు
- వైసీపీ బలోపేతం కోసం ఎంతో కృషి చేశా
- 53 వేల ఓట్లతో ఓడిపోయిన వారికి ఇక్కడ ఇన్‌ఛార్జ్ ఇవ్వడం తనకు అర్థం కానీ విషయం



**చిలకలూరిపేట**

వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్.. ప్రతిసారి తనకు మాట ఇచ్చి.. తర్వాత ఆ మాట నిలబెట్టుకోకపోవడం తనను తీవ్రంగా బాధించిందని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ తెలిపారు. గురువారం పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో మర్రి రాజశేఖర్ విలేకర్లతో మాట్లాడుతూ.. త్వరలో తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు ఆయన ప్రకటించారు. 2019లో తనకు - మిగతా3లో



## నక్సల్స్‌కు అమిత్‌షా
# వార్నింగ్

- లొంగిపోయేందుకు మావోయిస్ట్‌లకు కేంద్రం అవకాశం ఇస్తుంది
- కాదు కూడదు అంటే వారి పట్ల కేంద్రం కఠినంగా వ్యవహరిస్తోంది
- వచ్చేదాది మార్చి నెల లోపు నక్సలిజాన్ని అంతచేస్తాం

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం



## మాజీ సీఎం జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యేలు అన్నా, జంకె

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, మార్చి 20)
తాడేపల్లి పార్టీ ఆఫీసులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గం వైఎస్‌ఆర్సిపి సమన్వయకర్త అన్నా వెంకట రాంబాబు, మార్కాపురం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. వారు ఇరువురు పార్టీ సమస్యలు, నియోజకవర్గ సమస్యలను వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి వివరించారు.

## గౌరవం దక్కనిచోట ఉండకూడదని నిర్ణయించుకున్నాం

మర్రి రాజశేఖర్

ఎమ్మెల్సీ పదవికి, వైసీపీకి రాజీనామా చేశా

టిడిపిలో చేరటానికి సిద్ధమవుతున్నాం





(షణ్ముఖ వెలుగు, చిలకలూరిపేట, మార్చి 20)
కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వైయస్ రాజశేఖర్‌రెడ్డి బిడ్డ పార్టీ పెట్టారని, తన అధికారాన్ని వదిలేసి మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి వెంట నడిచానని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ అన్నారు. గురువారం మర్రి రాజశేఖర్‌రెడ్డి నివాసంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో పార్టీ కోసం అధ్యక్షులుగా ఉండి 14 సంవత్సరాల పాటు అహర్నిశలు కృషి చేశానని తెలిపారు. 2019లో తనకు టికెట్ ఇస్తామని చెప్పి మాజీ మంత్రి విడదల రజనీకి ఇచ్చారు. గెలిపించుకుని వస్తే మంత్రి పదవి ఇస్తామని తన పాదయాత్రలో భాగంగా కళామందిర్ సెంటర్లో ప్రజల సాక్షిగా చెప్పారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తనకు ఇస్తామనే మంత్రి పదవి ఇవ్వకుండా కాలయాపన చేసుకుంటూ వచ్చి ఎమ్మెల్సీ ఇచ్చారని తన ఆవేదన వ్యక్తం చేశారు. 2024లో కాబట్టి మనోహర్ నాయుడుకి టికెట్ ఇచ్చి గెలిపించమని చెప్పారు. పార్టీ కోసం కష్టపడ్డాను. ఆ తరువాత గుంటూరులో 58 వేల ఓట్ల పైచిలుకతో ఓడి పోయిన రజినినీ తీసుకు వచ్చి మరల చిలకలూరిపేట పార్టీ ఇన్ చార్జ్ పదవి కట్టబెట్టారు. తనకు ఇన్చార్జి పదవి దసరా (విజయ దశమి) కి ఇస్తామని చెప్పి ఆమెకు ఇచ్చారన్నారు. సుమారు 50 ఏళ్ల నుంచి రాజకీయాల్లో ఉన్న తనకు దక్కవలసిన గౌరవం దక్కలేదు, పార్టీలోకి మారడానికి ప్రధాన కారణం జగన్మోహన్ రెడ్డియే అని మర్రి పేర్కొన్నారు. మా మామయ్య సోమేపల్లి వెంకటసుబ్బయ్య, నా అభిమానులు, శ్రేయోభిలాషులకు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అడుగడుగునా అడ్డంకులు సృష్టించడమే కాకుండా ఇబ్బందులకు గురి చేశారన్నారు. వారి కోరిక మేరకు గౌరవం దక్కనిచోట ఉండకూడదని టిడిపిలోకి వెళ్లాలనే నిర్ణయం తీసుకున్నాం. పార్టీకి రాజీనామా చేస్తున్నాను, తన రాజీనామాను జగన్మోహన్ రెడ్డి ఆమోదింపచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గేరా లింకన్, బైరా వెంకట కోటి, షేక్ అలీమీయా, సాతులూరి కోటి పలువురు నాయకులు పాల్గొన్నారు.

# జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్ల నిధులు కేటాయించాలి

జిల్లా సమగ్రాభివృద్ధికి

రూ.10 వేల కోట్ల నిధులు కేటాయించాలి

వెలుగొండ ప్రాజెక్టును సత్వరం పూర్తి చేయాలి

పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

ప్రజా చైతన్య యాత్రల సమస్యలు సత్వరం పరిష్కరించాలి

సిపిఎం ధర్నాలో పలువురు వక్తలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 20)
వెనుకబడిన జిల్లాగా గుర్తించిన ప్రకాశం జిల్లా సమగ్ర అభివృద్ధికి పదివేల కోట్లు నిధులు కేటాయించాలని, వెలుగొండ ప్రాజెక్టును సత్వరం పూర్తి చేయాలని జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నాడు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జి.రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం దశాబ్దకాలం అనేక ఉద్యమాలు, జైలుశిక్షల ఫలితంగా వెనుకబడిన జిల్లాగా ప్రకటించిన కేంద్రం, జిల్లా వెనుకబాటుతనాన్ని రూపుమాపే దిశగా నిధులు కేటాయించలేదని, పాలకవర్గాలు సైతం జిల్లా అభివృద్ధిని విస్మరించారని, పలువురు వక్తలు దుయ్యబట్టారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే నిధులు కేటాయించాలని, దామాషా ప్రకారం నిధులు రాబట్టేందుకు ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, ప్రజాభివృద్ధిని విస్మరిస్తే ప్రజా ఉద్యమం తప్పదని పార్టీ నేతలు తీవ్రంగా హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో గ్రానైట్, ఆక్వా, పొగాకు వంటి వనరుల ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఏటా 20 వేల కోట్లు జమ అవుతున్నాయని, జిల్లా ప్రజానీకానీకానికి చెందిన ఈ సంపదలో జిల్లా వాటాగా రూ పదివేల కోట్లు ఒకే విడత ప్యాకేజీగా అందిస్తే జిల్లాలో వెలుగొండ, సంగమేశ్వరం, పాలేటిపాడు, గుండ్లకమ్మ వంటి సాగునీటి ప్రాజెక్టులు పూర్తయి వ్యవసాయం అభివృద్ధి చెందటంతోపాటు, తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు. దీంతోపాటు పారిశ్రామికంగా అభివృద్ధి పొంది జిల్లా అన్నింటా ప్రగతిని సాధిస్తుందన్నారు. విద్యారంగంలోనూ. ఉపాధి అవకాశాలలోను, అటు పారిశ్రామికంగానూ అన్నింటా వెనుకబడిన ప్రకాశం జిల్లా బీపీ,షుగర్ వంటి వ్యాధుల్లో అగ్రభాగాన ఉన్న అంశాన్ని సందర్భంగా గుర్తు చేశారు.కారణం ఉపాధి హక్కు అవకాశాలు కరువై మానసిక ఒత్తిడికి గురైన ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని విశ్లేషించారు. సాగునీటి వనరులు లేక వ్యవసాయం అభివృద్ధి చెందక ఉపాధి అవకాశాలు కరువై ఏటా 5 లక్షల మంది ఉపాధి కోసం వలస పోతున్నారని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర బడ్జెట్ రూ లక్ష కోట్ల అప్పులతో రూపొందించటం ప్రజలను అప్పుల లోకి నెట్టే చర్యగా విమర్శించారు, రాజధాని నిర్మాణానికి రాష్ట్రం రూ 46 వేల కోట్ల అప్పు చేయటం ప్రజలకు మరో భారంగా పరిణమిస్తుందని, కేంద్రం ప్రకటించిన రూలక్ష కోట్ల గ్రాంట్ కోసం ముఖ్యమంత్రి కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజల పక్షం వహించవలసిన జిల్లా ప్రజాప్రతినిధులు తమ స్వార్ధ ప్రయోజనాలకు, వ్యక్తిగత ప్రయోజనాలకు కృషి చేస్తున్నారు తప్ప జిల్లా అభివృద్ధిని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. గత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తి కాకుండా జాతికి అంకితం చేస్తున్నట్లు ప్రకటించి ప్రజలను మభ్య పెట్టారని దుయ్యబట్టారు. జిల్లాలో గుండ్లకమ్మ, పాలేరు, మన్నేరు, మూసి వంటి నదుల ద్వారా ఏటా 150 టీఎంసీల నీరు వర్షాకాలంలో సముద్రంలో కలిసి వృధా అవుతుందని, ఆయా నదుల పై సాగునీటి ప్రాజెక్టులు నిర్మాణం చేయాలని చేయాలని డిమాండ్ చేశారు. గుండ్లకమ్మ గేట్లు పని, కాల్వల నిర్మాణం పని ఏళ్లు గడుస్తున్న పూర్తికాలేదని, ఇప్పటికీ మరమ్మత్తులు చేపట్టకపోవడం అత్యంత విచారకరమన్నారు. దొనకొండ పారిశ్రామిక కారిడార్, కనిగిరి నిమ్జ్ కోసం వేలాది ఎకరాలు సేకరించిన ప్రభుత్వం భూములను బీళ్ళుగా మార్చింది తప్ప ఒక్క పరిశ్రమను స్థాపించకపోవడం విచారకరమన్నారు. దర్శి డ్రైవింగ్ స్కూల్, కొత్తపట్నం హార్బర్, పాకల బీచ్ వంటి పథకాలు ఎన్నికల హామీలుగా మిగిలాయి తప్ప వీసమంత ప్రగతిని సాధించలేకపోవడం విచారకరమని ఆరోపించారు. మూడేళ్ల క్రితం జిల్లాకు ప్రకటించిన ఆంధ్రకేసరి యూనివర్సిటీ కి తగినన్ని నిధులు కేటాయించకపోవడం వల్ల యూనివర్సిటీ రూపురేఖలు ఏర్పడలేదని పేర్కొన్నారు. మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణం ప్రారంభించి, అర్ధంతరంగా పనులు నిలుపు చేయడం పట్ల ఆక్షేపణ వ్యక్తం చేశారు. వీటితోపాటు (తరువాయి 4లో...)



## మూడు సంవత్సరాల బాలుడిని హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు, రూ.10 వేలు జరిమానా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 20)
మూడు సంవత్సరాల బాలుడిని హత్య కేసులోని ముద్దాయికు జీవిత ఖైదుతో పాటు రూ.10 వేలు జరిమానాను విధించారు. తీర్పును ఒంగోలులోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి ఎ భారతి చెప్పారు. నెల్లూరుకు చెందిన షేక్ ఖాదర్ వలీ తన భార్య షేక్ సాల్మాతో కలిసి జీవనోపాధి నిమిత్తం చీమకుర్తి మండలంలోని ఎల్లయ్య నగర్ గ్రామానికి వచ్చి బేల్దారు పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. వారికి షేక్ షాహుల్, మూడు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు.అయితే షేక్ ఖాదర్ వలీ తన భార్యని సాల్మాను నిత్యం అనుమానంతో వేధిస్తూ ఉంటాడు. కుమారుడు తమకు పుట్టలేదని ఇబ్బందులు పెడుతుంటాడు. ఈ క్రమంలోనే 2018 నవంబర్ 30వ తేదిన ఖాదర్‌వలి తన కుమారుడు షాహుల్‌ను మోటార్ సైకిల్ మీద ఎక్కించుకొని బూదవాడ సమీపంలో ఎర్రకొండ వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ మూడేళ్ల తన కుమారుడిని కూరగాయల కోసుకొనే చాకుతో పాటు పదునైన రాయితో తన కుమారుడి గొంతు కోసి రాళ్ల మధ్య పూడ్చిపెట్టి తిరిగి తను ఇంటికి వచ్చాడు. భార్య సాల్మా తన కొడుకు ఏడి అని అడుగగా తనకు తెలీదని సమాధానం చెప్పాడు. దీంతో ముద్దాయి భార్య సలాల్మా ఆమె సోదరుడు పిల్లవాడి గురించి రెండు రోజులు వెతుకగా హత్య జరిగిన ప్రదేశంలో మఅతదేహం కనిపించింది. దీంతో చీమకుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తగు రీతిలో విచారించి 2018 డిసెంబర్ 8వ తేదిన ఖాదర్‌వలి అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసారు. అనంతరం పబ్లిక్ ప్రాసిక్యూటర్ (తరువాయి 4లో...)

## ముస్లింలకు అండగా ఉంటా

ఆరు నెలల్లో ఒంగోలు రూపురేఖలు మారుస్తా

పేదవాడి సొంతంటి కల నెరవేరుస్తాం

ముస్లింలకు రంజాన్ తోఫా అందించేందుకు చర్యలు

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే దామచర్ల



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 20)
నియోజకవర్గంలో ముస్లింల సమస్యలు పరిష్కరించేందుకు తాను ఎల్లవేళలా సిద్ధంగా ఉంటానని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు హామీ ఇచ్చారు. ఒంగోలులోని టిడిపి కార్యాలయంలో గురువారం రాత్రి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు రంజాన్ ఉపవాసంలో ఉన్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏర్పడటంలో ముస్లింలు కీలక పాత్ర పోషించారు అన్నారు. వారి సమస్యలు పరిష్కరించి ఎందుకు తమ ఇంటి గేటు ఎల్లవేళలా తీసి ఉంటాయన్నారు. తన వద్దకు వచ్చేందుకు ఎటువంటి సిఫార్సులు అవసరం లేదన్నారు. ఒంగోలు నగరాన్ని కేవలం ఆరు నెలల వ్యవధిలో (తరువాయి 4లో...)



# ముస్లింలకు అండగా ఉంటా

రూపురేఖలు మారుస్తానన్నారు. ఈపాటికి అభివృద్ధి కార్యక్రమాలు వేగం పుంజుకున్నాయన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలకు ఇల్లు లేని ప్రతి పేదవానికి ఒంగోలులో రెండు సెంట్లు భూమి ఇస్తామన్నారు. ఈపాటికి ఇల్లు లేని పేదలను గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నామన్నారు. గత ఐదు సంవత్సరాల కాలంలో ముస్లింలకు తీరని ద్రోహం జరిగిందన్నారు. 2014 - 19 కాలంలో ముస్లింలకు రంజాన్ తోఫా అందించింది తెలుగుదేశం ప్రభుత్వమే అన్నారు. ఈ ఏడాది కూడా ముస్లింలకు రంజాన్ తుఫాన్ అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కసరత్తు





చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, దామచర్లను ఆశీర్వదించారు. అనంతరం ఇఫ్తార్ విందు లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, ఒంగోలు నగర పార్టీ అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, బండారు మదన్, తెలుగుదేశం పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి కపిల్ భాష, మాజీ మున్సిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, పాలూరి వెంకటేశ్వర రెడ్డి, గొల్లపూడి బాబురావు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సమగ్రాభివృద్ధికి
# రూ.10 వేల కోట్ల నిధులు కేటాయించాలి

ఈనెల 8 నుంచి 17 వరకు ప్రజా చైతన్య యాత్రలో ప్రజలు లేవనెత్తిన తాగునీరు, పారిశుధ్యం, ఇళ్ల స్థలాలు వంటి సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయని. పాలకవర్గం చిత్తశుద్ధితో నిధులు కేటాయించి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన ప్రజలు చైతన్యవంతులై ప్రజా ఉద్యమం చేపడతారని హెచ్చరించారు. సీనియర్ నాయకులు పెంట్యాల హనుమంతరావు, జిల్లా కమిటీ సభ్యులు పి వెంకటరావు, కెజి మస్తాన్, కంకణాల రమాదేవి, పెంట్యాల కల్పన, మాట్లాడుతూ త్రిబుల్ ఐటీ ని పూర్తి చేయాలని, నడికుడి శ్రీకాళహస్తి రైల్వే పనులు సత్వరం, పూర్తి చేయాలని కోస్టల్ కారిడార్ కు తోడ్పాటు అందించాలని, కనిగిరి ప్రాంతంలో త్రాగునీటి సమస్య పరిష్కరించాలని, విద్య, వైద్యం వంటి వనరులను అభివృద్ధి పరచాలని, పొగాకు, మిర్చి, వంటి పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని. మౌలిక సదుపాయాలు పెంచాలని, అర్హులైన పేదలందరికీ ఇల్లు మంజూరు చేయించి రుణ సదుపాయం కల్పించాలని, టిట్కో ఇళ్ళను సత్వరం పూర్తి చేయించి లబ్ధిదారులకు అందించాలని. ఒంగోలు పట్టణ పరిధిలోని పేదలందరికీ రెండేసి సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జుజ్జూరు జయంతి బాబు, కాలం సుబ్బారావు, వి బాలకోటయ్య, బంకా సుబ్బారావు, వెల్లంపల్లి ఆంజనేయులు, టంగుటూరు రాము, ఉబ్బా ఆదిలక్ష్మి, పల్లాపల్లి ఆంజనేయులు, కిలారి పెద్దబ్బాయి, టి శ్రీకాంత్, ఎస్ స్వామిరెడ్డి, నెరుసుల వెంకటేశ్వర్లు, వి మోజస్, తంబి శ్రీనివాసులు, టి మహేష్, కె ఎఫ్ బాబు, యస్ డి హుస్సేన్, కంకణాల వెంకటేశ్వర్లు, ఎస్కె అమీర్, ఉబ్బా వెంకటేశ్వర్లు, దామా శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# మూడు సంవత్సరాల బాలుడిని హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు, రూ.10 వేలు జరిమానా




ఎన్ వసుంధర ప్రాసిక్యూషన్ తరుపున వాదించారు. పోలీస్ సిబ్బంది సాక్షులను కోర్ట్‌లో సమయానుసారం హాజరు పరిచారు. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ మార్గదర్శకత్వంలో గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా సమర్థవంతంగా విచారణ నడిపి సరైన సాక్ష్యాధారాలతో నిందితులపై నేరనిరూపణ చేశారు. దీంతో గురువారం జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు జడ్జి ఎ భారతి నిందితునికి యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. పిల్లలపై దాడులు మరియు అఘాయిత్యాలకు పాల్పడే వారికి ఈ తీర్పులు గుణపాఠమని, పిల్లలపై దాడులకు పాల్పడిన వారిపై కఠినమైన శిక్షలు పడేలా పోలీసు శాఖ షి చేస్తుందని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. కోర్టుల్లో నడిచే కేసుల విషయంలో కోర్ట్ మానిటరింగ్ సిబ్బంది మరింత బాధ్యతగా పనిచేసి నిందితులకు తప్పకుండ శిక్షలు పడే విధంగా కఅషి చేయాలని సూచించారు. సదరు కేసులో సరైన సాక్ష్యాధారాలు కోర్ట్‌లో ప్రవేశపెట్టి సమర్థవంతంగా ట్రయల్ మానిటరింగ్ చేసి నిందితుడు శిక్షించబడటంలో క్రియాశీలక పాత్ర పోషించిన అప్పటి ఒంగోలు రూరల్ సీఐ ఓ దుర్గ ప్రసాద్, చీమకుర్తి ఎస్సై జివి చౌదరి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్. వసుంధర, చీమకుర్తి కోర్టు ఏఎస్సై వీరాస్వామి, కోర్టు లైజన్ హెడ్ కానిస్టేబుల్ రాఘవరావులను జిల్లా ఎస్పీ ఏఆర్ దామమోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

# మాకు అన్యాయం జరిగింది

### పురుగుల మందు డబ్బాలతో
### తహసీల్దార్ ఆఫీస్ ముందు తోకపల్లి ప్రజల ధర్నా
### న్యాయం కోసం పోరాటం




**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, మార్చి 20)**
ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నాకు దిగారు తోకపల్లి ప్రజలు. పురుగుల మందు డబ్బాలతో మాకు అన్యాయం జరిగింది అంటూ న్యాయం కోసం పోరాటం చేస్తున్నామన్నారు. వివరాలలోకి వెళితే మేకల శంకర్ రావు నుండి ప్రాణహాని , ఆస్తి నష్టం ఉందని, తోకపల్లి ప్రజల యొక్క ఆమనస్యం 263-3,102-1సీ, 349, 23,19 సర్వే నెంబర్లు గల భూమిని తహసీల్దారు , డిప్యూటీ తహసీల్దార్‌తో కలిసి పేద ప్రజలకు అన్యాయం చేశారంటూ వారు వాపోయారు. నకిలీ డాక్యుమెంట్ సృష్టించి బినామీ పేర్లతో రిజిస్టర్ చేయించి ఆ తర్వాత మేకల శంకర్ పేరు మీద రిజిస్టర్ చేయించుకున్నాడు అంటూ ప్రజల ఆవేదన వ్యక్తం చేశారు. తోకపల్లి గ్రామస్తుల మానసిక క్షోభని ఎవరైనా ఆలకించరా అంటూ ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంలో ఇదే మేకల శంకర్ రావు కేసులు పెట్టించి బెదిరించి మా భూములను ఆక్రమించబోయాడు. ఇప్పుడు ఇలానే చేస్తున్నాడు ఇతనిని ఎవరు అడ్డుకోలేరా అని గ్రామస్తులు వాపోయారు. మేకల శంకర రావు బాధితులు ఒరిజినల్ రికార్డులని అధికారులకు చూపించి మాకు న్యాయం చేయమని మొరపెట్టుకున్నా అసమర్థత అధికారులు అసమర్థంగా వ్యవహించారని ఆరోపించారు. ఇప్పుడు మేకల శంకర్ రావు మీదనే ఆన్లైన్ చేసి పాస్ బుక్ మంజూరు చేయగలుగుతున్నారు అని ప్రజల విన్నవించారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ ఖలీల్, ఆర్ఐ గోపి, తోకపల్లి వీఆర్ఓ సంజీవరెడ్డి, 10 లక్షల రూపాయలు లంచం తీసుకుని నకిలీ డాక్యుమెంట్ సృష్టికర్త మేకల శంకర్ రావుకి ఆన్లైన్ చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు సమగ్రత విచారణ జరిపించి న్యాయం ఏం చేయాలని తోకపల్లి గ్రామస్తులు బిట్ర తిరుమలమ్మ, బిట్రా వెంకటనారాయణ, వి మల్లికార్జున అధికారులను కోరుతున్నారు.



# ప్రభుత్వ హామీల కమిటీలో ఎమ్మెల్యే జూలకంటికి చోటు

**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మార్చి 20)**
ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగానే అసెంబ్లీలో కీలక కమిటీల నియామక ప్రక్రియను గురువారం ఎన్డీఏ కూటమి చేపట్టింది. ఇందులో భాగంగా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి ప్రభుత్వ హామీల కమిటీలో సభ్యునిగా అవకాశం దక్కింది. ఈ కమిటీకి చైర్మన్‌గా కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు వ్యవహరించనున్నారు. అయితే ఈ కమిటీ ప్రజలకు జవాబుదారీగా ఏడాది పాటు అసెంబ్లీలో వ్యవహరించనున్నది. తనపై నమ్మకం ఉంచి, ప్రభుత్వ హామీల కమిటీలో తనకు చోటు కల్పించిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి కృతజ్ఞతలు తెలిపారు.

# మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి

### స్మాట్ మీటర్స్ బిగింపు నిలిపి వేయాలి

### ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె వెంకటేశ్వర్లు డిమాండ్




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 20)

రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ బిగింపు ప్రారంభమైన నేపథ్యంలో మీటర్ రీడర్స్ ఉద్యగ భద్రత సమస్య వచ్చిదని వెంటనే స్మాట్ మీటర్లు బిగిపు ప్రక్రియ ఆపివేయాలని, గత 15 ఏళ్ల నుంచి మీటర్ రీడర్స్ పనిచేస్తున్న వారికి ఉద్యగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఒంగోలులో ఏడు డివిజన్ల పరిధిలోని మీటర్ రీడర్స్ ఏఐటీయూసీ  ఆధ్వర్యంలో ఎలక్ట్రిసిటీ ఎస్ఈ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ధర్నాలో అధిక సంఖ్యలో  మీటర్ రీడర్స్ హాజరయ్యారు. ధర్నాను ఉద్దేశించి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల బిగింపు వలన దాదాపు 15 ఏళ్లుగా మీటర్ రీడర్స్ గా పనిచేస్తున్న కార్మికుల ఉపాధికి గండి పడుతుందన్నారు. ఎన్నికల ముందు నారా లోకేష్  ఎట్టి పరిస్థితుల్లో స్మార్ట్ మీటర్లు బిగించేది లేదని హామీ ఇచ్చి అందుకు భిన్నంగా ఇప్పటికే కార్యాలయాలకు చిన్నచిన్న పరిశ్రమలకు స్మార్ట్ మీటర్లు బిగించి ప్రస్తుతం ఇండ్లకు కూడా బిగించే ప్రయత్నం చేయటం అన్యాయం అన్నారు. పీస్ రేట్ కింద వారికిచ్చే రేటులో కూడా కార్మికుల నుండి కాంట్రాక్టర్లు నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. ఏఐయుటిసి జిల్లా సహాయ కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న 13 జిల్లా కార్యాలయాలకు అదనంగా 13 కార్యాలయాలు రానున్నందున మీటర్ రీడర్స్ గా పనిచేస్తున్న కార్మికులను కొత్త కార్యాలయాల్లో నియామకం జరపాలన్నారు .  మిగిలిన కార్మికులు ఉంటే ప్రభుత్వ కార్యాలయాలలో వేలాదిగా ఉన్న ఖాళీలలో వారిని భర్తీ చేసి న్యాయం చేయాలన్నారు. ధర్నా అనంతరం మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా నాయకత్వం ఎస్పీకి సమస్యలతో కూడిన వినతిపత్రం ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రత్నరాజు, కార్యదర్శి కుంచాల సిద్దయ్య, ట్రెజరర్ సాజిత్ ఉపాధ్యక్షుడు బొప్పరాజు నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ హుస్సేన్, మాలాద్రి, మస్తాన్ , శీను, పిచ్చయ్య, రవి, శివ, ప్రసాద్, సిద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.






# కాటమరాజు తిరునాళ్ల ఏర్పాట్ల పై చర్చ

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, మార్చి 20)

కాటంరాజు ఆలయ సందర్శన కార్యక్రమానికి సబ్ కలెక్టర్ హాజరై ఈ నెల 29వ తేదీ జరగనున్న శ్రీ కాటమరాజు తిరునాళ్ల ఏర్పాట్ల గురించి వారికి వివరించారు. ఆలయ కమిటీ చైర్మన్ పల్లె బోయిన వెంకటరాజు యాదవ్ తిరునాళ్ల సందర్భంగా వివిధ శాఖల అధికారులచే తిరుణాళ్లను కట్టుదిట్టంగా నిర్వహించుటకు అధికారులకు సూచనలు ఇవ్వమని తగు సహాయం చేయమని సబ్ కలెక్టర్‌ను కోరారు.  తిరుణాల సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ వారిచే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించాలని వచ్చినటువంటి భక్తులకు డీహైడ్రేషన్ వంటి సమస్యలు గాని, మరేదైనా సమస్యలు వచ్చినప్పుడు తక్షణమే స్పందించేలాగా చూడాలని కోరారు. ఆలయ కమిటీ బాధ్యులు పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్ ఆలయ పరిసర ప్రాంతాల్లో కోనేటిలో ఆర్డబ్ల్యూఎస్ డిపార్ట్మెంట్ వారిచే ఏర్పాటు చేయించాలని విద్యుత్ శాఖ వారిచే ఇప్పటికే తెరగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ఎలక్షన్ బాబు సహకారంతో ఏర్పాటు చేయబడినటువంటి విద్యుత్ స్తంభాలు లైటింగ్ వ్యవస్థతో పాటు సెల్ఫోన్ టవరు లేని సమస్యను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకురావడం జరిగింది. సుమారు లక్షల మంది భక్తులు హాజరయ్యే ఈ తిరుణాలకు నీటి ఎద్దడిది లేకుండా తగువిధంగా సహకరించమని ఆర్టీసీ బస్సు సౌకర్యంతో పాటు వస్తున్నటువంటి వందలాది వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేయుటకు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారితో మాట్లాడి తగువిధంగా సహాయం చేయమని వారిని కోరారు. అదేవిధంగా భవిష్యత్తులో వెలుగొండ జలాలు వచ్చిన పిమ్మట ఇప్పటివరకు వస్తున్నటువంటి సుంకేసుల కల్నతుల దారి ఉపయోగంలో ఉండదని కావున సబ్ కలెక్టర్ ప్రత్యేక చొరవతో చిన్న దోర్నాల నుండి కాటంరాజు దేవాలయానికి వచ్చే దారిని పునర్ నిర్మించే విధంగా తగు చర్యలు గైకొనాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాథ్‌ను ఆలయం లోపలికి తోడుకొని వెళ్లి గంగమ్మ తల్లికి కాటమరాజు స్వామికి వారిచే పూలమాల వేయించారు. పూజాధికాలు నిర్వహించిన తర్వాత వెంకట్ రాజు యాదవ్,పి ఎల్ పి యాదవ్ బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్,పల్లెబోయినా గోపాల్ యాదవ్, నాగం వెంకటేష్ యాదవ్ లు దుస్సాలువాలతో,పూల మాల తో సబ్ కలెక్టర్‌ని ప్రత్యేకంగా సత్కరించారు. అనంతరం సబ్ కలెక్టర్ వెంకట త్రినాధ్ మాట్లాడుతూ తిరునాళ్ళకు సంబంధించి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి అన్ని విధాల సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు యాదవ సోదరులు, ఆలయ పూజారులు పాల్గొన్నారు.



# చేపల వేటకై వెళ్లి ప్రమాదవశాత్తు యువకుడు మృతి

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మార్చి 20)

మండలంలోని చెన్నిపాడు గ్రామానికి చెందిన వ్యక్తి చేపలు పట్టేందుకు వెళ్లి వాగు గుంతలో పడి మరణించిన సంఘటన గురువారం జరిగింది. పొన్నలూరు ఎస్ఐ అనుక్ తెలిపిన వివరాల ప్రకారం చెన్నిపాడు గ్రామస్తుడైన  నూకతోటి చిరంజీవి (18) పుట్టుకతోనే మూగ, చెవుడు ఉన్నట్టు, అతను తన తల్లితో ఉంటూ చిన్న చిన్న కూలి పనులకు వెళ్తూ ఉండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం 10 గంటలకు చేపలు పట్టుటకు గాను చేపలు పట్టే వల తీసుకొని చెన్నిపాడు గ్రామానికి ఉత్తరం వైపున ఉన్న పాలేరు వాగు వద్దకు వెళ్లాడని, అక్కడ ఉన్న నీటి గుంతలో చేపలు పడుతూ ప్రమాదవశాత్తు అందులో పడి చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపినట్లు తెలిపారు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.





# శక్తి ప్రోగ్రాం పై బాలికలకు అవగాహన

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, మార్చి 20)

ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు మార్కాపురం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శక్తి ప్రోగ్రాంపై బాలికలకు టూ టౌన్ ఎస్ఐ డాక్టర్ రాజమోహన్‌రావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ నేర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికల కోసం శక్తి కార్యక్రమం అనేది బాలికలకు వారి సామర్థ్యాన్ని గుర్తించి, సాధికారత కల్పించేందుకు, వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు, సమాజంలో సమానమైన పాత్ర పోషించేలా చేయడానికే ఉద్దేశించిన కార్యక్రమం అన్నారు. ఇది బాలికల విద్య, ఆరోగ్యం, పోషణ,  నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి సారిస్తుందన్నారు.



# గ్రామైక్య సంఘాల స్వయం సహాయక సంఘాల రికార్డులను ఆడిటింగ్‌కు సిద్ధం చేయాలి





(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మార్చి 20)

కొండేపి వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘ సహాయకులకు గురువారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొండేపి మండల డీఆర్‌డీఏ-వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ బి. గోపీనాథ్ మాట్లాడుతూ 2024 - 25 ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకున్నందున గ్రామ సంఘాల , స్వయం సహాయక సంఘాల ఆర్థిక లావాదేవీల రికార్డులను పరిశీలించి ఆడిటింగ్ చేయటం జరుగుతుందని, ఈ ఆడిటింగ్‌కు రికార్డులన్నీ సిద్ధపరచాలని సీసీలకు, వివోఏలకు ఆదేశాలు ఇచ్చారు. ఇటీవల జిల్లా స్థాయిలో డీఆర్ డి ఏ వెలుగు సిబ్బందికి జరిగిన సమీక్షా సమావేశంలో సంఘాల పుస్తకాల నిర్వహణ నమోదు విషయంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ గారు ఇచ్చిన ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. నెలలో ప్రతి మొదటి శుక్రవారం మరియు మూడవ శుక్రవారం జిల్లాస్థాయిలో సమీక్ష సమావేశాలు జరిపి పురోగతిని పరిశీలించడం జరుగుతుందని, మంచి ప్రోగ్రెస్‌తో సిద్ధపడి హాజరు కావాలని పిడి ఆదేశించినట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం డి ఆర్ డి ఏ వెలుగు శాఖ ద్వారా స్వయం సహాయక సంఘ సభ్యులకు అమలు చేస్తున్న సంస్థాగత నిర్మాణ పనులు , ఆర్థికపరమైన క్రమశిక్షణలు, సంక్షేమ కార్యక్రమాలు అవగాహన, అమలు మొదలగు విషయాలకు పట్ల నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. అదేవిధంగా ఎంపిక చేసిన గ్రామాలలో ఉల్లాస్ కార్యక్రమం ద్వారా వయోజనులకు ఆదివారం 23వ తేదీ ఆదివారం రోజు న సక్రమంగా పరీక్ష నిర్వహించి పూర్తిచేయాలని తెలిపారు. స్వయం సహాయక సంఘ సభ్యులకు ప్రభుత్వం ద్వారా మరియు బ్యాంకుల ద్వారా అందిస్తున్న సిఐఎఫ్ రుణాలు స్త్రీ నిధి రుణాలు ఉన్నతి రుణాలు మరియు బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకొని జీవనోపాధిని పెంపొందించుకోవాలని సూచించారు. తీసుకున్న రుణాలను అంతే నిబద్ధత తోటి క్రమం తప్పకుండా వంద శాతం రికవరీ ఉండే విధంగా చెల్లింపులు చేయించాలని తెలియజేశారు. క్లస్టర్ లీగల్ కో ఆర్డినేటర్ ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో అతి త్వరలో స్వయం స్వయం సహాయక సంఘాల ఆర్థిక లావాదేవీలు తనిఖీ చేయుటకు ఆడిటర్లు విజిటింగ్‌కి వస్తారని రికార్డులను సిద్ధంగా ఉండాలని కోరారు. చివరగా డీఆర్‌డీఏ వెలుగు శాఖకు సంబంధించి వివిధ సబ్జెక్ట్ లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు వీఓఏలు, ఎం. శేషమ్మ, ఎం.గంగాధర, ఏ.అన్న పూర్ణమ్మలను అభినందిస్తూ వారికి ప్రత్యేక బహుమతులు అందజేయడం జరిగింది. మిగిలిన వీఓఏలు కూడా వచ్చే రివ్యూ నాటికి పని తీరు మెరుగు పరుచుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీసీలు డి మల్లికార్జున, వి కృష్ణారెడ్డి, కె రామానుజులు, గోవిందమ్మ, రమణమ్మ, అకౌంటెంట్ కోటేశ్వరీ, మండలంలోని అందరూ వీఓఏలు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా పేదలకు ఒక వరం

## నామినికి రెండు లక్షల నగదును అందజేసిన ఏపిజిబి మేనేజర్ నాగేంద్ర కుమార్



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, మార్చి 20)

యర్రగొండపాలెం మండలంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ అమ్మానిగుడిపాడు శాఖ నందు ఖాతాదారుడు అయిన మామిళ్ల దావీదు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా కింద ఇన్సూరెన్స్ నమోదు చేసుకున్నాడు మా ఖాతాదారుడు గుర్రపుశాల గ్రామానికి చెందిన మామిళ్ల దావీదు అనారోగ్య కారణాల వలన డిసెంబర్ నెలలో చనిపోయాడు. ఇతనికి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి ఇన్సూరెన్స్ పథకం కింద నమోదు చేసుకోవడం వలన నామిని అయిన తన భార్యకు మామిళ్ళ లలితమ్మకు రెండు లక్షల రూపాయల నగదును అందజేయడం జరిగింది. బ్యాంక్ మేనేజర్ నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ బ్యాంకులో ఉన్న ప్రతి ఖాతాదారుడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న ఇన్సూరెన్స్ వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఖాతాదారులకు తెలియజేశాడు. అదేవిధంగా నామిని అయినటువంటి వారికి నగదు అందజేయుటకు అన్ని రకాల సహాయ,సహకారాలు తమ శాఖ నుండి అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నాగేంద్ర కుమార్ అసిస్టెంట్ మేనేజర్ అంజు నాయక్ , శివశర్మ,ఆఫీస్ అసిస్టెంట్ కాసింవలి, సయ్యద్ రాంబాబు, బీసీలు శ్రీనివాసులు, లింగమయ్య పాల్గొన్నారు.

# గ్రామసభలో పాల్గొన్న అధికారులు

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, మార్చి 20)


ఎన్డీఏ ప్రభుత్వం నిర్వహించిన గ్రామసభలలో మార్కాపురం 12వ సచివాలయంలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్నారు అధికారులు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా పీ4 నిర్వహించిన సర్వేలో పూర్ ఫ్యామిలీలు గణన లెక్కలు తయారైనవి, వారికి ప్రభుత్వ పథకాలలో అధిక ప్రాధాన్యం ఇచ్చేలాగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ లెక్కలను గ్రామసభల ద్వారా పరిశీలించి ఫైనల్ చేయబడిందన్నారు. 12వ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్ ఆఫీసర్‌తో పాటుగా బిజెపి నాయకులు రామకృష్ణ, బేతంచెట్టి అనీలు, జనసేన నాయకులు సురేష్, నరసింహారావు, కొప్పుల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.




# సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆకట్టుకున్న చీఫ్ విప్ జీవీ స్కిట్

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మార్చి 20)

మూడు రోజుల పాటు జరిగిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల చివరి రోజు స్కిట్‌తో అందర్నీ కడుపుబ్బా నవ్వించారు చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. రాజకీయ నాయకులు ఎదుర్కొనే చిత్రమైన పరిస్థితులను కళ్లకు కట్టారు చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు బృందం. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఇదీసంగతి అంటూ హాస్య నాటకం ప్రదర్శించిన చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, జూలకంటి బ్రహ్మానంద రెడ్డి, కూన రవికుమార్, పాశం సునీల్, అరవింద బాబు, వర్ల కుమార్ రాజా అందర్నీ ఆకట్టుకున్నారు. చీఫ్‌విప్ జీవీ, ఎమ్మెల్యే విష్ణుకుమర్‌రాజు మధ్య సన్నివేశాలతో మొదలైన నాటకం ఆద్యంతం నవ్విస్తునే సాగింది. నాయకులు ఎదుర్కొనే క్లిష్ట పరిస్థితుల్ని సున్నితంగా చెప్పింది. విష్ణుకుమార్ రాజు తమ ఊరి అల్లుడిని మొదలు పెట్టమంటూ అడిగే విన్నపంతోనే అందరిలో నవ్వులు మొదలయ్యాయి. తమ కుమారుడికి సీట్ కావాలని... సబ్జెక్ట్ లు పాస్ కాకపోయినా తెలుగుదేశం నేతలకు చెందిన నారాయణ, భాష్యం, విజ్ఞాన్, ఎన్నారై కళాశాలల్లో సీటు ఇప్పించాలంటూ అమాయక పాత్రలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆ నవ్వులు మరింత పెంచారు. పాస్ కాకపోతే ఏమిటి కనీసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లో సీటు ఇప్పించలేని ఎమ్మెల్యే ఎందుకంటూ హాస్యం పండించారు జూలకంటి. అలాంటి పరిస్థితుల్లో ఏ ఎమ్మెల్యే అయినా సీటు ఇప్పించలేడంటూ కార్యకర్త కోరిక తీర్చలేక.. సమాధాన పరచలేక సహనం పాటించే పాత్రలో జీవీ ఆంజనేయులు జీవించారు. అనంతరం పది పాస్ కాని విద్యార్థికి హెడ్‌మాస్టర్ లేదా ఎస్పీ ఉద్యోగం కావాలంటు ఎమ్మెల్యే అరవింద్ బాబు, బాలయ్య బాబు, పవన్ కళ్యాణ్ తో సినిమా డైరెక్షన్ ఇప్పించాలంటూ కార్యకర్త పాత్ర పోషించిన కూన రవి నవ్వులు పూయించారు. ఈ స్కిట్ సాగుతున్నంతసేపు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ సహా ప్రతి ఒక్కరూ నవ్వుతునే కనిపించారు.






# మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీని ఎమ్మెల్యే జూలకంటి నిలబెట్టుకోవాలి

## తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

## భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ పై అఖిలపక్ష సమావేశంలో ప్రణాళిక

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మార్చి 20)

మున్సిపల్ ఆప్కాస్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామంటూ ఎన్నికల ముందు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సిపిఐ మాచర్ల ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి, ఎంసిపిఐ రాష్ట్ర నాయకులు అబ్రహం లింకన్ డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ కొమెరా వీరాస్వామి భవన్ లో గురువారం జరిగిన అఖిలపక్ష సమావేశానికి హాజరై మాట్లాడుతూ.20 ఏళ్లుగా కొద్దిపాటి జీతంతో పురప్రజలకు సేవలందిస్తున్న మున్సిపల్ ఆప్కాస్ కార్మికులను ఉద్యోగాల నుండి అకారణంగా తొలగించటం బాధాకరమన్నారు. పొట్టకూటి కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కోవిడ్ సమయంలో ప్రజలకు సేవలందించిన కార్మికులను ఎలా తొలగిస్తారో పాలకులు సమాధానం చెప్పాలన్నారు. పలువురు కార్మికులు నాటి వైసిపి పెద్దల ఇళ్లలో అప్పుడు పని చేశారనే నెపంతో ఇప్పుడు వారి పొట్ట గొట్టడం సరి కాదన్నారు. దీంతో ఆ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా చిరు ఉద్యోగులతో చెలగాటమాడటం మంచిది కాదని హితవు పలికారు. నాడు చిన్న కాన్వెంట్ ఎదురు అఖిలపక్షం నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలో.కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామంటూ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఇచ్చిన హామీ ని గుర్తు చేశారు. అనంతరం పలువురు ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయానికి సంబంధం లేని వ్యక్తులకు మున్సిపల్ కార్మికులుగా పేర్లు నమోదు చేసి అధికారులు లక్షలాది రూపాయలు వారికి కట్టబెట్టి ప్రజల సొమ్మును దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. నిజాయితీగా పని చేసిన కార్మికులపై ఆంక్షలు విధించి, విధులకు రావొద్దంటూ హుకుం జారీ చేయడంలో అర్థం లేదన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని కార్మికుల పట్ల సానుకూలంగా వ్యవహరించి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేయక తప్పదని వారు హెచ్చరించారు. సమావేశంలో ఎంసిపిఐయు నాయకులు మాచవరపు నాగేశ్వరరావు, ఏఐవైఎఫ్ నాయకులు నర్రా రంగస్వామి, మాచర్ల కుమార్, బి ఎస్ పి నాయకులు గుండాల సైదులు, గురజాల అప్పారావు, ఏఐటీయూసీ నాయకులు మిద్దెపోగు బాబురావు, ఎస్ఎండి భాషా మేస్త్రి, విష్ణు మొలకల అప్పారావు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో మత్స్యకారుల అభివృద్ధి పథకాల అమలు పై మాగుంట ప్రశ్న

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 20)

ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లాలో ప్రధానమంత్రి మత్య సంపద యోజన పథకం కింద గత ఐదేళ్లలో ప్రాజెక్టుల అమలు, కేటాయించిన వాడిన నిధులు, లబ్దిదారులు, నైపుణ్య పెంపుకు శిక్షణ, అవగాహన కార్యక్రమాల అమలు గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర మత్స్య పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ సహాయక మంత్రి, జార్జ్ కురియన్ సమాధానమిస్తూ కేంద్ర మత్య మంత్రిత్వ శాఖ ప్రధానమంత్రి వారు మత్స్య సంపద యోజన పథకాన్ని 2020–21 నుంచి 2024–25 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మత్స్య పరిశ్రమ, చేపల ఉత్పత్తిదారుల అభివృద్ధికై 39 రకాల యూనిట్లకు రూ.2,399 కోట్ల వ్యయంతో పనులకు ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలు ఆమోదించడం జరిగిందని, అందులో రూ.559 కోట్లు కేంద్రం వాటాయని తెలిపారు. గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 3,17,558 మత్స్యకారులు లబ్ధిపొందగా, ప్రకాశం జిల్లాలో 13,203 మంది లబ్ది పొందారని, 525 మత్స్యకారులకు శిక్షణ, 7,750 మందికి అవగాహన కార్యక్రమాలు జరిగాయని, ప్రకాశం జిల్లాలో 30,345 యూనిట్లు మంజూరు కాగా, 19,441 యూనిట్లు పూర్తయ్యాయని తెలిపారు. పై పథకం కింద కేంద్ర మత్స్య మంత్రిత్వ శాఖ, పశుసంవర్ధక – పాడిపరిశ్రమ శాఖలు "శిక్షణ –అవగాహన –ప్రకటన –సామర్ధ్యం పెంపు" కార్యకలాపాలను నూరు శాతం కేంద్ర సహాయంతో అమలు చేయుచున్నదని, దీన్ని నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డు పర్యవేక్షిస్తుందని కేంద్ర మంత్రి తెలిపారు.



# జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 20)

ఈ నెల 20న ఆంధ్రపదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండ్యన్‌చే జిల్లాలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారులకు, ప్రోగ్రాం అధికారులకు, రాష్ట్రంలో అమలు అవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్కూల్ పిల్లల ఆరోగ్య పరీక్షలు వేసవి కాలములో వచ్చు వ్యాధుల నుంచి కాపాడుకొనుట సికిల్ సెల్ అనీమియా, ప్రధాన మంత్రి మాతృవందన యోజన నూరు శాతం ఆబ ఐడి సాధించుట సిబ్బంది అందరు ముఖ్య ఛాయా చిత్రం ద్వారా హాజరును అమలు చేయుట ఎన్‌సిడి 3.0 కార్యక్రమం ద్వారా 18 సంవత్సరాలు నిండిన వారందరికీ కాన్సర్ పరీక్షలు చేయుట ఏఎన్ఎం, సిహెచ్ఓల ద్వారా గృహ సందర్శనములు చేయుట ప్రస్తుతం నిర్మాణములో ఉన్న ఆరోగ్య శాఖ భవనములపై సమీక్షించుట తదితరుల అంశములపై సమీక్షించారు. ప్రతి ఆరోగ్య కార్యకర్త గర్భిణులను, ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి రిజిస్టర్ చేసిన వారికీ సకాలములో అందవలసిన సేవలను అందించవచ్చని తెలిపారు. ప్రతి ఆరోగ్య కార్యకర్తకు, సిహెచ్ఓ, రక్తహీనతవు బాధపడుచున్న వారికి సరైన చికిత్సను వెంటనే అందించునట్లు అయితే మాతృమరణములను నివారించవచ్చన్నారు. అదేవిధముగా ఐదేళ్ల లోపు పిల్లలను , బరువు తక్కువున్న వారిని గుర్తించి న్యూట్రీషిన్ రీహాబిలిటేషన్





సెంటర్‌నకు రెఫర్ చేసిన శిశుమరణములను నివారించవచ్చునను అని తెలిపారు. పుట్టిన ప్రతి బిడ్డకు నిర్దేశించిన అన్ని టీకాలను సకాలంలో వేసి వారి వివరాలను యువిఇన్ యాప్, ఆర్‌సిహెచ్ పోర్టల్ నందు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదువు పిల్లలకు రాష్ట్ర బాల సురక్ష కార్యక్రమం ద్వారా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా 2025వ సంవత్సరం తేదీ ఏప్రిల్ నెల 1వ ముఖ్య ఛాయా చిత్రము ద్వారా హాజరును అమలు చేయబడును అని తెలిపారు. రాసున్న వేసవికాలంలో వడదెబ్బ నివారించుటకు ప్రజలకు నివారణపై అవగాహనా కల్పించవలెనని ఓఆర్ఎస్ ద్రవం ప్రజలు తాయారు చేసుకోను విధానంను ప్రజలకు తెలియ పరచవలెననని, ప్రతి పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నందు అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను సిద్ధంగా ఉంచాలన్నారు. నూరుశాతం ఐడి పూర్తి చేయవలలెనని తెలిపారు. గిరిజన ప్రాంతంలో సికిల్ సెల్ వ్యాధితో బాధపడుచున్న వారికీ సకాలములో చికిత్సను అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ టి వెంకటేశ్వర్లు, ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ పి పద్మజ, డిపిఎంఓ డాక్టర్ సౌజన్య. డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ శ్రవణ్, డాక్టర్ హేమంత్, చల్ల ప్రభాకర్‌రెడ్డి, డేటా మేనేజర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వెలిగొండ ప్రాజెక్టు 2026 కల్లా పూర్తి చేయాలి

## సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, మార్చి 20)

మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసనతో పాటు కోర్టు సెంటర్లో ధర్నా నిర్వహించారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు 2026 కల్లా పూర్తి చేయాలి ఒక్కొక్క పిడిఎఫ్‌కు 20 లక్షల రూపాయలు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి చెల్లించాలన్నారు. కటాఫ్ తేదీని ఎత్తివేసి ప్రాజెక్టు నీరు వదిలే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు అందరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి తోపాటు ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. గజిట్ నోటిఫికేషన్ ప్రకారం అన్ని గ్రామాల నిర్వాసితులకు ఏకపర్యాయం ఆర్ఆర్ ప్యాకేజి చెల్లించాలన్నారు. అవార్డు పూర్తి అయిన అనంతరం పెండింగులో వున్న పిడిఎఫ్ కుటుంబాలను అవార్డు పాస్ చేయాలన్నారు. ముప్పు గ్రామాలలో మౌళిక సౌకర్యాలు కల్పించాలన్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. మార్కాపురం జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలన్నారు. మార్కాపురం మెడికల్ కాలేజీ పూర్తి చేసి ప్రభుత్వంలో ఆధీనంలో నడపాలని డిమాండ్ చేశారు.





# విద్యార్థినికి సూర్యా శ్రీ ట్రస్ట్ ఆర్థిక సాయం




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 20)


ఒంగోలులోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో నివసించే పి రేవతి ఫేస్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో బిటెక్ ఫస్ట్ ఇయర్లో 86% వరకు సాధించింది. రెండో సంవత్సరం చదువుతూ కాలేజ్ ఫీజు కట్టలేక బాగా ఇబ్బంది పడుతూ ట్రస్టు వ్యవస్థాపకులు మండవ మురళి కృష్ణకి సూచన మేరకు సూర్యా శ్రీ ట్రస్ట్‌కి సంప్రదించారు. స్పందించిన సూర్యా శ్రీ ట్రస్ట్ చైర్మన్ సయ్యద్ షహనాజ్ ప్రవాస భారతీయుడు ఎం పవన్ సహకారంతో 40 వేల రూపాయలు ట్రస్టు వ్యవస్థాపకులు మండవ మురళి కృష్ణ చేతుల మీదగా రూ.40 వేలు చెక్ ట్రస్ట్ కార్యాలయంలో నేడు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మురళి కృష్ణ మాట్లాడుతూ రేవతి బాగా చదువుకుని త్వరగా ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. సెక్రెటరీ సర్దార్ భాష మాట్లాడుతూ బాగా చదువుకుంటూ ఫీజు కట్టలేని పేద పిల్లలు ఉంటే సూర్య శ్రీ ట్రస్ట్ 9703466669 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

# నవ్వులు పూయించిన 'ఇదీ సంగతి' స్కిట్

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మార్చి 20)

ఎన్డీఏ ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవాడ ఏ-కన్వెన్షన్ సెంటర్ నందు ఏపీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు గురువారం ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉత్సాహభరితంగా సాగాయి. "ఇదీ సంగతి" అనే స్కిట్ లో ఎమ్మెల్యే జూలకంటి, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఎంతో అద్భుతంగా నటించి చూపర్లను ఆకట్టుకున్నారు. ఈ స్కిట్ అసాంతం చూస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి నారా లోకేష్ పడిపడి నవ్వుకుంటూ ఉల్లాసంగా తిలకించారు. ఈ స్కిట్‌లో జీవి మంత్రి పదవిలో నటించగా, ఇంటర్మీడియట్ తప్పిన తమ్ముడి ఇంజనీరింగ్ సీట్ కోసం జూలకంటి వచ్చి అడుగుతున్న కార్యకర్త పాత్రలో నటించారు. ఈ స్కిట్‌లో పలువురు ఎమ్మెల్యేలు కార్యకర్తలుగా నటించి, వారి పాత్రలో అద్భుతంగా నటించి, నవ్వులను పండించారు.






# అఖిల భారత రైతు – కూలీ సంఘం (ఏఐకేఎంఎస్)

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కామ్రేడ్ చిట్టిపాటి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నిక

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 20)

అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర వ్యాప్త విలీన సభ గురువారం గుంటూరు నగరంలో జరిగింది. ఈ విలీన సభకి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులు, రైతు కూలీలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. సభ అనంతరం 33 మందితో నూతన రాష్ట్ర కార్యవర్గం ఎన్నికైంది. ప్రకాశం జిల్లా నుంచి కామ్రేడ్ చిట్టిపాటి వెంకటేశ్వర్లు తిరిగి రెండవసారి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పొగాకు, మిర్చి, శనగ, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేయాలన్నారు. అసైన్మెంట్ యాక్ట్‌ను సవరణ చేసి, అర్హులైన దళిత, గిరిజనులకు పట్టాలు ఇవ్వాలన్నారు. పై సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా పోరాటం చేస్తానని ఆయన తెలిపారు.



## స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో

# కాపులకు 15 శాతం అవకాశం కల్పించాలి

### రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు వినతి పత్రం అందజేత

### ఏపీ రాష్ట్ర కాపు, బలిజ, తెలగ మహాసభ స్టీరింగ్ కమిటీ ప్రతినిధి బృందం





**(షణ్ముఖ వెలుగు, విజయవాడ, మార్చి 20)**

రాష్ట్రంలో ఎన్‌డిఏ కూటమి అధికారంలోకి రావడానికి తీవ్రంగా కృషి చేసిన కాపు, బలిజ, తెలగలకు నామినేటెడ్, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా నిష్పత్తి ప్రాతిపదికన 15 శాతం పదవులు ఇవ్వాలని రాష్ట్ర కాపు,బలిజ, తెలగ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం సభ్యులు శాసనాల వీరబ్రహ్మం, చెన్ను శివప్రసాద్ (అడ్వకెట్), కెవి. రమణ, కె.రాఘవయ్యలు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణను గురువారం మంత్రి నివాసంలో కలసి వినతి పత్రం అందజేశారు. టిడిపి ఆవిర్భావం నుండి రాయలసీమలో బలిజ, కోస్తా ఆంధ్రలో కాపు, మరికొన్ని ప్రాంతాల్లో తెలగ పేరుతో ఆ పార్టీకి పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటిస్తూ, అధికారంలోకి వచ్చేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయడం జరిగిందని వారన్నారు. ప్రభుత్వ నామినేటెడ్, అలాగే భవిష్యత్తులో జరగబోవు పంచాయితీ, ఎంపిటీసీ, జడ్పీటిసి ఎన్నికల్లో 15 శాతం, ఎమ్మెల్సీ, రాజ్యసభ సభ్యులుగా ఈ వర్గాలకు అవకాశం కల్పించాలని కోరారు. అలాగే గతంలో ఇచ్చిన విధంగా గాజుల బలిజ, పిరిక బలిజ, ఈడిగ, శెట్టి బలిజ లకు బిసి ధృవీకరణ పత్రాలు తిరిగి మంజూరు చేయాలని కోరారు. కాపు కార్పొరేషన్ కు నిధులు కేటాయించి విద్యా,వ్యాపార అభివృద్ధికి సహకరించాలని మంత్రిని కోరారు. నిర్మాణంలో ఉన్న కాపు భవనాలను పూర్తి చేయాలని టిడిపి రాష్ట్ర టిడిపి పరిశీలకులు ,ఏపి కాపు, బలిజ, తెలగ మహాసభ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు శాసనాల వీరబ్రహ్మం, అడ్వకేట్ చెన్ను శివ ప్రసాద్, కె.రాఘవయ్య, (నెల్లూరు), కెవి రమణ (కుప్పం), తదితరులు మంత్రి నారాయణను కలసిన వారిలో ఉన్నారు.

# జాతీయ కబడ్డీ రిఫరీగా కరేడు వాసి



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 20)**

మండల పరిధిలోని కరేడు గ్రామానికి చెందిన సాదం శ్రీనివాసరావు ఎన్‌ఐఎస్ కబడ్డీ జాతీయస్థాయి కబడ్డీ టోర్నమెంట్ కు రిఫరీగా ఎంపికయ్యాడు. ఈ నెల 27నుండి 30వ తేదీ వరకు బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయలో జరిగే 34వ సబ్ జూనియర్ జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఆంధ్రప్రదేశ్ రెఫరీస్ బోర్డు నుండి రెఫరీగా ఎంపికైనట్లు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎలమంచిలి శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలియచేసినట్లు చెప్పారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన నన్ను ప్రోత్సహించిన మామయ్య టీచర్ శ్రీ ఉమ్మడి ప్రోలు శ్రీనివాసులు కి గురువు ఆసోది రవి కిరణ్ కుమార్ రెడ్డి పి.డికీ ఈ స్థాయికి తీసుకొచ్చిన ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ రిఫరీస్ బోర్డ్ కన్వీనర్ పి.రవీంద్ర బాబు పి.డికి, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎలమంచిలి శ్రీకాంత్‌కి, నెల్లూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ వాయిల శీనుకి పాదాభివందన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మారుమూల గ్రామం నుండి జాతీయస్థాయి రెఫరీగా ఎంపికైన శ్రీసాదం శ్రీనివాసరావుకి వ్యాయామ ఉపాధ్యాయులు ఓగుబోయిన శ్రీనివాసులు, పిగిలి శ్రీనివాసులు, ఎన్ వెంకట్రావు, కే ప్రభాకర్, జి ప్రభాకర్, ఎం మోహన్‌రావు, ఎన్‌ఐఎస్ కబడ్డీ కోచ్ శివ సిసింద్రీ, వాయిల బాబు, కరేడు గ్రామ ఓరగుంటమ్మ తల్లి స్పోర్ట్స్ క్లబ్ సీనియర్ క్రీడాకారులు, గ్రామస్తులు క్రీడాభినందనలతో శుభాకాంక్షలు తెలిపారు.



# పేకాట శిబిరం పై దాడి

**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మార్చి 20)**

పోలీసులకు సమాచారం అందిన ప్రకారం గురువారం మండలంలోని భోగనంపాడులో పేకాట ఆడుతున్న ఎనిమిది మంది వ్యక్తులను ఎస్ఐ అనుక్ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9,430ల నగదు స్వాధీనం పరుచుకొని వారి మీద కేసు నమోదు చేశారు. అనంతరం వారిని కోర్ట్ నందు హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ అనుక్ తెలిపారు.

# కాలు కోల్పోయిన బాధితుడికి చైతన్య ఫ్రెండ్స్ సర్కిల్ చేయూత



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, మార్చి 20)**

పట్టణంలోని బుధవారం అనకుంట వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాలు కోల్పోయిన క్షతగాత్రుడికి, చైతన్య ఫ్రెండ్స్ సర్కిల్ చేయూత అందించి ఆదుకుంది. వివరాల మేరకు స్థానిక కొలుకుల రోడ్డు నందు నివాసం ఉంటున్న సూరె చిన్న సత్యనారాయణ బుధవారం రోడ్డు ప్రమాదంలో ఒక కాలు పూర్తిగా నలిగిపోయి విరిగిపోయింది. అతను ఆర్థికంగా పూర్తిగా ఇబ్బంది పడుతుండటం, వారి కుటుంబ సభ్యులు కూడా ఆర్థికంగా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోదించడం గమనార్హం. సూరె సత్యనారాయణను వెంటనే నరసరావుపేటకు తీసుకొని వెళ్లవలసిందిగా డాక్టర్లు సూచించారు,వైద్య ఖర్చులు నిమిత్తం దాతలు ఎవరైనా తమ వంతు సహాయాన్ని చేయవలసిందిగా బాధితుని బంధువులు కోరడంతో విషయం తెలుసుకున్న జ్యోతి ఫ్రెండ్స్ సర్కిల్ తరపున రూ.5వేల సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కృష్ణ, వితాకోటేశ్వర్లు, పబ్బిశెట్టి రవికుమార్, మలిపెద్ది రవీంద్రబాబు, ఆడిపి నాగయ్యలు పాల్గొని అదనంగా, రూ.3,500 ఇవ్వగా మొత్తం కలిపి రూ.8,500 ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి మా సభ్యులు తమకు చేతనైనంత సహాయం అందించడంలో ముందంజలో ఉంటారని, స్థానిక, స్థానికేతరులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు ఇలాంటి బాధితులకు సహాయం అందించడానికి ముందుకు రావాలని కోరారు.

# రక్తదానం అభినందనీయం



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, మార్చి 20)**

మండలంలోని సుద్ధకురువ తండా గ్రామానికి చెందిన నాగు నాయక్ అనే వ్యక్తికి ఆరోగ్యం బాగాలేక యర్రగొండపాలెం రవీంద్రా ఉదయ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. రక్త కణాలు తగ్గడంతో రక్తం అవసరం పడటంతో సోషల్ మీడియా వేదికగా వాట్సాప్ గ్రూప్ లో రక్తం అవసరమని పోస్ట్ చేశారు. ఆసరా ట్రస్ట్ వారు శ్రీనివాస్ నాయక్ వెంటనే స్పందించి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన శ్రీనివాస్ నాయక్‌కు వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసరా ట్రస్ట్ వారు బాణావత్ రవి నాయక్, గోపాల్ నాయక్, బద్దు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలు అనుసరించి వాహనాలు నడపండి

### మీ గమ్యస్థానాలను సురక్షితంగా చేరుకోండి

### ప్రకాశం జిల్లా పోలీస్‌లు




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 20)**

ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఉత్తర్వుల మేరకు విజిబుల్ పోలీసింగ్, వాహన తనిఖీలలో భాగంగా ఒంగోలు ట్రాఫిక్ పోలీస్ వారు చెక్ చేస్తుండగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిలో 11 మందిని గురువారం స్పెషల్ జేఎస్ సీఎం మేజిస్ట్రేట్ వీఎస్ రామారావు వద్ద హాజరుపరిచారు. వారిలో 10 మంది వాహనదారులకు రూ.26,000 జరిమానా, ఒక్క వాహనదారుడికి రూ.3,000 జరిమానా, 5 రోజులు జైలు శిక్షను విధించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై కుటుంబాలను శోక సంద్రంలోకి వెళ్ళనివ్వవద్దని, మద్యం సేవించ కుండా వాహనాలు నడిపిన యెడల ప్రమాదాల నుండి మీరు సురక్షితంగా ఉండడమే గాక, మీ తోటి వారిని సైతం రక్షించగలిగిన వారవుతారన్నారని ఒంగోలు ట్రాఫిక్ సీఐ పాండు రంగారావు ఓ ప్రకటనలో తెలియచేసారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com